# పాదరేణువు

తెల్లగా తెల్లవారింది. 'ఆరు గంటలకల్లా తపాల సంచి తీసికొని పోవటానికి గంట కొట్టినట్లు వచ్చే రన్నరు రాములు 6 1/2 గంటలయినా రాలేదేమా?' అని అనుకొన్నారు, పోస్టు మాస్టరు రామానుజంగారు. ఆ రోజు ఒకటవ తారీకు. లెక్కలు పైకి పోవాలి. మరో పది నిమిషాలు గడిచాయి. రామానుజంగారు బయటకువచ్చి చూచాడు. ఆరు బయట అరుగు మీద దిగులుగా కూర్చొన్న రాములు కన్పించాడు.

"ఏరా! రాములూ! అలా కూర్చొన్నావు?" అన్నారు రామానుజంగారు.

రాములు మాట్లాడలేదు.

"మాట్లాడవేంరా? ఇలా లోపలికిరా" అంటూ లోనికి దారి తీశారు రామానుజంగారు.

లోపలికి వెళ్ళాక రెండు కన్నీటి బొట్లు రాల్చాడు రాములు- "మళ్ళీ ఇయ్యాల బజార్లో నవ్వారండి" అంటూ

"అదిట్రా, పిచ్చినాగమ్మా!" అని తేల్చేశారు రామానుజంగారు. "అరేయ్! రాములు! ఇది పాపిష్ఠి లోకం. ఏదో అంటుంది. లేనిపోనివి కల్పించి గాలి కింత దుమారాన్ని చేర్చి వెదజల్లుతుంది, అమాయక ప్రాణుల మీద. సుఖంగా, నిర్మలంగా తమ బ్రతుకులు తాము బ్రతికేవారిపై కన్నెర్ర చేస్తుందీ నీచ సంఘం. మనం తల వంచుకొని మన దారిన పోవటం మన కర్తవ్యం. అవసరంగా బాధపడకు, లే"



అంటూ ఊరడించారు.

రాములు మనసు తేలిక పడ్డది. క్షణంలో అంతా మరిచి పోయాడు. ఒక బుజం మీద తపాలు సంచిని, మరో బుజం మీద రామాపురంలోని పోస్టుమాస్టరుగారి అమ్మాయిగారికి చేర్చవలసిన సొరకాయల బస్తాను ఎత్తుకొని వెళ్ళిపోయాడు.

అప్పుడప్పుడు రాములు గ్రామంలో తన్నేవరో ఏమో అన్నారని రావటం, రామానుజం గారు ఘాటుగా సమాజాన్ని తిట్టడటం రివాజే!

లింగంగుంటలో ఎవరిని కదిలించి, రాములు ఎవరని అడిగి చూచినా, చివరకు పాలు త్రాగే పిల్లలు సైతం 'ఫలానా' అంటూ చటుక్కున చెబుతారు.

చదువు, సంధ్య, ఆస్తి, పాస్తి లేని రాములు ఆ గ్రామంలో అంతటి ప్రాముఖ్యం గల వ్యక్తిగా చెలామణి కావటానికి ముఖ్య కారణాలు అనతగ్గ వాటిలో ఒకటి, బొద్దుగా అరడుగుల ఎత్తున కండలు తిరిగి నల్లగా నిగ నిగ లాడే అతగాడి గంభీర విగ్రహం. అంతటి శరీరానికి పరమ శీతాకాలంలోనైనా మొలకు కట్టుకున్న కొన్న పంచ తప్ప మరో బట్ట ధరించకపోవటం రెండు. ప్రతి ఉషస్సులోను చేతిలో పొడుగుపాటి కత్తి గజ్జెల బాణాకర్రతో పది మైళ్ళలోగల రామాపురం కేసి బుజాన తపాల సంచితో బయలుదేరి, మళ్ళీ సాయంత్రం మసక చీకటిలో మరో తపాల సంచితో తిరిగి వచ్చే ఆ నిర్విరామయాత్ర మూడు. లింగంగుంటలో కొద్దిపాటి గవర్నమెంటు ఉద్యోగులలో అతగాడూ, ఒకడు కావటం. వీటన్నింటికన్నా ముఖ్యమైన కారణం మరొకటి లేక పోలేదు. అదే.... శ్రీరంగం. అతగాడి భార్య.

శ్రీరంగాన్ని, శ్రీరంగం అని వ్యవహరించేవారు చాల అరుదు. అంతా 'మెరుపు తీగ' అనేస్తూ ఉంటారు. వార్నన్నట్లుగానే శ్రీరంగం చక్కని ఆకారం గలది. పచ్చగా సమపాళ్ళైన శరీర సౌష్ఠవంతో, కళ కళ లాడే ముఖంతో మెరుపు తీగ లాగే ఉండేది. ఎటొచ్చీ "ఘటన" వలన ఆ మెరపు తీగ, మేఘం లాంటి రాములుకు కళత్ర రత్నమయింది.

రాములు, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. తన పదవ ఏటనే గ్రామంలో మోతుబరి రామానుజంగారి దగ్గర పాలేరుగా చేరాడు. అలాగే ఇరవై సంవత్సరాల జీవితాన్ని ఆయన దగ్గర గడిపాడు.

ఈలోగా రామానుజంగారు నాలుగు సంవత్సరాల క్రితం క్రొత్తగా పెట్టిన పోస్టాఫీసుకు పోస్టు మాస్టరు కావడం, దానికి రాములు రన్నరు కావడం జరిగాయి. రాములు రన్నరు కాగానే రామానుజంగారే చేయి చేసికొని ప్రక్క గ్రామంలో శ్రీరంగం సంబంధం చూచి ఆ మూడు ముళ్ళూ వేయించారు.

మొదట్లో రాములు ఆకారాది చేష్టలకు శ్రీరంగం విముఖత చూపినా రామానుజంగారు, రాములు గవర్నమెంటు ఉద్యోగుల ఖాతాలో ఎలా కలిసి పోయిందీ, ఒక నాడెంతటివాడు కానున్నది వివరిస్తూ ఇచ్చిన ఉపన్యాసానికి లొంగిపోయి, ఈ సంబంధానికి ఒప్పేసుకుందిట.

ఇక రాములకు రామానుజంగారు "స్వామి."

'అరే రాములూ! ఆ మండేది మంటే. దానిలో దూకితే కాలిపోతావు. దుర్మరణం సంభవిస్తుంది. అయినా దూకు' అని రామానుజంగారంటే చాలు, రాములు మరో మాట మాటాడకుండా అది ఎలాంటి అగ్నిగుండమైనా దూకేస్తాడు. అంతటి భక్తి, విశ్వాసాలు రాములుకు రామానుజంగారి పట్ల.

రాముల్కుకు రన్నరు ఉద్యోగం అయిన నాటి నుండి రామానుజంగా రింటిలో పాలేరు బాధ్యతలు వైదొలగినట్లే. కాని రాములుకలా అనిపించదు. తన కీ జన్మ రామానుజంగారి పాలేరుగా ఉండటానికే నిర్దేశింపబడిందనీ, తనా పాలేరు బాధ్యతలను విస్మరించరాదనీ అనుకొనేవాడు. అందుకే పగలంతా తపాల సంచి మోసి, రాత్రి యింటికి వచ్చాక, రామానుజంగారి గొడ్ల దగ్గర అంతా బాగు చేసి వాటికి నీళ్ళు పెట్టి, మేత వేసి, ఎల్ల ఎద్దును రెండు సార్లు దువ్వి దాని సిగమార కేసి రెండు సార్లు చూచుకొని మరీ కొంప చేరుకొనేవాడు.

రాములు పెళ్ళి జరిగి మూడు నెలలు అలా తిరిగాయో లేదో, గ్రామంలో తానొక ప్రసంగ విషయమై పోయాడు శ్రీరంగం మూలాన.

"మోయలేని బరువు. నెగ్గలేని పందెం- వాడి జీవితం శ్రీరంగంతో" అనటం ప్రారంభించి, "అదెక్కడ షోకులాడి" అనేవారు, రాములుకు పరోక్షంకాని పద్ధతిలోనే కొందరు. రాములు మొదట్లో మొదట్లో అట్టే ఆ గుస గుసలను వినేవాడు కాదు. కాని కొన్నాళ్ళకు ఆ గ్రామంలో తానొక హేళనా వస్తువు కాడంతో తన్నెందుకు ఆ లోకం వెక్కిరిస్తున్నదా అనే మీమాంసలో పడిపోయాడు.

తన పాలిటి స్వామి రామానుజంగారితో విన్నవించుకొన్నాడు, తన హృదయావేదన.

రామానుజంగారు అతి తేలికగా నవ్వేసి, "పిచ్చి నాగన్నా, లోకంరా! అంటే,

దాని మారు పేరు అబద్ధాల పుట్ట, అభూత కల్పనల కల్పతరువు. నోటి కొచ్చినట్లు వాగుతుంది. మనలను కవ్విస్తుంది. తన విషవాహినులలోనికి లాగటానికి ప్రయత్నిస్తుంది. మనం బెంబేలు పడిపోకూడదు. ఎవరేమన్నా శ్రీరంగం నిప్పు. నేను చెప్పుతున్నాను. ఇక ఈ లోకుల మాటన్నావా? కాకులు. వాటితో మన కేమిటి? ఒక చిరునవ్వు నవ్వి పోతూ ఉండు" అని బోధించారు.

రాములు మనసు తృప్తి పడింది. శ్రీరంగం మీద విశ్వాసం పొంగి పొరలింది. ఆనాడు రామాపురంలో ఉన్న రామానుజంగారి అమ్మాయిగారింటికి తీసికొని వెళ్లుతూన్న వేరుసెనగ కాయల బస్తా దించకుండా వెళ్ళిపోయాడు.

ఆనాటి నుంచి రాములుకు లోకలు కాకుల్లాగానే కన్పించారు, రామానుజం గారు చెప్పారు కాబట్టి. ఆ మరునాటి నుంచే కాకిగోల మరీ ఎక్కువయింది.

"రాములుకు తపాల సంచి డ్యూటీ అయితే ఆ శ్రీరంగానికి గడప గడపకు తిరిగే డ్యూటీ" అని, "శ్రీరంగం పలుకుబడి కుర్రాళ్ళ దగ్గర మరీ పెరిగి పోతున్నది" అని, "గంటకు ఐదు చీరలు, పది జాకెట్లు మారుస్తున్నది" అని, అగలాగే "విటుల జాబితా మారిపోతున్నది" అని, "కోమటి బంగారయ్య కొట్లో మల్లెపూల సబ్బులు, పౌండరు డబ్బాలు శ్రీరంగం కొంపకు సరాసరి దిగుమతి అవుతున్నవి" అని- ఇలా ఎన్నో మాటలు. మళ్ళీ మళ్ళీ నవ్వేవాడు. అలా నవ్వుతూ గ్రామం దాటి, రామాపురంకేసి గజ్జెల కర్రతో పరుగెత్తుతూ మళ్ళీ మళ్ళీ నవ్వేవాడు. ఆ గజ్జెలు వినిపిస్తూ ఉండేవి రాములుకు. తాను తపాల సంచి మోసుకొని పోతున్నప్పుడు, తిరిగి వస్తూన్నప్పుడు లోకులు కాకులు అనుకొని, రామానుజంగారు ఆదేశించినట్లు చిరునవ్వు నవ్వబోయి, చేతకాక, కొంచెం పెద్దగా నవ్వేవాడు. ఆ నవ్వుకు ప్రతిధ్వనిగా ఆ లోకమూ నవ్వేది. రాములు కర్రా నవ్వేది.

ఆ రోజు ఒకటవ తారీకున, రామానుజంగారి నుండి అనునయ వాక్యాలు విన్న తరువాత తపాల సంచితో బయలు దేరిన రాములుకు ఊరి పొలిమేర దాటకముందే వర్షపు జల్లు తగిలింది. అలాగే మరికొంచెం దూరం నడిచాడు. కాని, సుబ్బన్న కుంట దగ్గర ఆ జల్లు మోపయింది. సుబ్బన్న కుంట మీది కావలివాడి గుడిసె లోనికి వెళ్ళాడు. అప్పటికీ ప్రక్క చేల వారంతా వర్షానికి

అక్కడ గుమికూడారు. రాములు రాకతో వారికి సరదా వేసింది.

"ఏరా! రాములూ! ప్రపంచానికి సేవ చేయటానికి పుట్టారు నీవు, నీ శ్రీరంగం" అన్నాడు జగ్గయ్య. నలుగురూ గొల్లుమన్నారు.

రాములు మనస్సు చివుక్కుమంది. కాని అంతలోనే రామానుజంగారు కనులలో కన్పించారు. తమాయించుకొన్నాడు.

జగ్గయ్య పాలిగాడు కొండాయ్ అందుకున్నాడు, "మా రాములు మామకు కొంపలోనికి ఎవరొచ్చినా కళ్ళే కనపడవు" అంటూ.

దూరంగా 'ఫెళ ఫెళ' మంటూ ఉరిమింది ప్రకృతి. ఈదర గాలి వేసింది. అంతటి ఈదర గాలిలో కూడా చొక్కా అన్నా పైన లేని రాములు శరీరం నుంచి వేడి పుట్టుకువచ్చినట్లనిపించింది.

"వాడికేం రా? వూరి నిండా బంధువులే" అన్నాడు నాగిరెడ్డి. మరోసారి వారి నవ్వులు పెచ్చరిల్లి ఫెళ ఫెళ మన్న మరో ఉరుము ధ్వనిలో కలిసి పోయాయి. రాములు చుట్టూ తేళ్ళు, జెర్రుల్లు ప్రాకినట్లనిపించింది. అతని కళ్ళ ముందు నుంచి రామానుజంగారు చిన్నగా తప్పుకొన్నట్లనిపించింది. ఆ స్థానంలో ఏదో శృంఖలాలను తెంచుకొంటున్న ఆత్మ గౌరవం, కవ్వింపబడిన మగతనం నిలిచి పోయాయి.

మరోసారి కొండాయ్ ఏదో కూశాడు. డబ్బాలో రాళ్ళు పోసి కుదిపినట్లు నవ్వారంతా.

దిక్కులు పిక్కటిల్లే ఉరుము ఉరిమింది. ఈసారి ప్రకృతి కాదు ఆరు అడుగుల రాములు - "ఏమిట్రా మీరు కూసింది?" అని.

గతుక్కుమన్నారంతా. తేరుకొని "ఉన్నమాటే" అన్నాడు కొండాయ్.

"ఉన్నమాటేం!" అంటూ లంఘించి, కొండాయ్ జబ్బ పట్టుకొని, "అరేయ్, నా శ్రీరంగం నిప్పు. మీరంతా కాకులు....నా శ్రీరంగం నిప్పు కాదని నిరూపిస్తావా?.... నిన్ను చంపి పారెయ్యమంటావా? తేల్చి చెప్పు" అంటూ హుంకరించాడు రాములు.

కొండాయ్ గడ గడ లాడి పోయాడు. అంతటి చలిలోను, వాడి శరీరమంతా చెమట పట్టింది.

"ఏం, మాట్లాడవు?"

జగ్గయ్య అందుకొన్నాడు. "అరేయ్, కొండా! దడుస్తావేందిరా? పదండి పోదాం. ఆ శ్రీరంగి ఈ చలికి ఎవడి పక్కలోనో దొరక్కపోతేగా?"

అంతా అవునన్నారు.

రాములు నిప్పులు కురిశాడు.

"ఆః! అంతే. నా శ్రీరంగం నిప్పు కాకపోతే నన్ను నరకండి. లేకుంటే కొండాయ్‌ని నేను నరుకుతా. సై" అంటూ తపాల సంచి, కూరగాయల బస్తాతో తిరుగు ముఖం పట్టాడు. అక్కడ చేరిన వారంతా అతన్ని అనుసరించారు.

చుట్టూ మబ్బు లేచి వికృతంగా అరచి జల్లు ప్రారంభించింది.

దారి పొడుగునా అప్పుడే తపాల సంచితో తిరిగి వస్తున్న రాముల్ని వింతగా చూచిన జనం అసలు విషయం విని వానన్నా లెక్క చేయకుండా గుంపుతో కలిసి నడిచి రావటం మెదలెట్టారు, మధ్య మధ్య కొండాయ్ రాములల పందెం గురించి వ్యాఖ్యానిస్తూ.

రాములు హుటాహుటిని రామానుజంగారి ఇంటి దగ్గరకు వచ్చి అరుగు మీద తపాల సంచి పడవేశాడు. లోపలికి వెళ్ళి రామానుజంగారికి ఈ విషయం చెపుదామనుకొన్నాడు. కాని మరు క్షణంలో ఆ ప్రయత్నం మానుకొన్నాడు. ఆ స్వామిని చూస్తే తన ఆవేశం హరిస్తుంది. ఆ శాంతమూర్తి సమక్షంలో తానొక నిమిత్తమాత్రుడుగా మారవలసి వస్తుంది.

రాములు వెంటనే సరాసరి గొడ్ల కొష్ఠం లోనికి వెళ్ళి, మేత నరికే గొడ్డలి తీసుకొని బయటికి వచ్చాడు, "రాండి" అంటూ.

తలుపులు మూసి ఉన్నాయి. కొండాయ్ విజయసూచకంగా నిట్టూర్చాడు, చుట్టూ ఓసారి కలయ చూచి.

రాములు ఛీంకరించాడు ఎలుగెత్తి. సమాధానం లేదు. రెండుసార్లలా పిలిచాడు. మూడోసారి ఒక్క తన్నుతో తలుపులు బార్లా తెరుచుకొన్నాయి. కుడిచేత్తో గొడ్డలిని ఒడిసి పట్టుకొని లోపలి కెళ్ళాడు రాములు అగ్గిని కక్కుతూ. పంచ, మెల్లా దాటి పడమటింటిలో జొరపడ్డాడు. అర్ధనగ్నంగా తెల తెల పోతూ,

ఆదరా బాదరా చీర ధరిస్తున్న శ్రీరంగం తలుపు కడ్డంగా నిలబడి, "తానం చేస్తున్నా రామాక" అంది.

హుంకరించాడు రాములు.

"నీకు కదూ చెపుతూంది? మనిషివా, పసరానివా," అంది.

ఒక నెట్టుతో దూరంగా తూలి పడి పోయింది. తల పడమటింటిలోని మంచానికి కొట్టుకొని చిల్లి పడింది.

రాములు కంటికి మంచం క్రింద ఒదిగి పోతూన్న ఓ మానవాకృతి ఆ చీకటిలోనూ కన్పించింది. మరుక్షణంలో ఆ ఆకృతి మీదికి లంఘించి ముసుగు లాగేశాడు, రాములు.

అంతే!

బయట ప్రకృతి భయంకరంగా, భీకరంగా అరిచింది. ఆ ధ్వని రాములు గుండెలలో మార్మోగింది.

ఏమి జరిగిందో! ఏమో! అంతా క్షణాలలో, నిమిషాలలో జరిగిపోయింది.

రాములు రౌద్ర స్వరూపంతోనే బయటికి వచ్చాడు.

"అరేయ్ కొండాయ్! చూపరా, ఎవరినైనా ఇంటిలో. హు! నా శ్రీరంగం నిప్పురా!" ఆ కంఠం భీకరమయింది.

"పగలంతా వానకు తడిసి నీటిలో నాని వత్తానని, రేత్రికి నాకు తొడుక్కోవటానికి పాతబడి చినిగిన కోటును కుటతా ఉంది నా శ్రీరంగం. చూడు" అంటూ కొండాయ్‌ని లోపలికి లాక్కొని పోయాడు. మరి కొంతమంది అనుసరించారు.

తలకు కట్టు కట్టుకొని, చినిగిన కోటును కుట్టుతూన్న శ్రీరంగం కన్పించింది.

అంతా బయటకు వచ్చారు.

"కొండాయ్‌ని నరికేస్తాడు రాములు" అనుకున్నారంతా.

జనాన్ని అంతా ఒక్కసారి ఛీత్కారంతోను, అసహ్యంగాను చూచి రాములు "పోరా కొండాయ్. నీవు లోకుల్లో వాడివి. అంటే కాకివి. నిన్ను నరికితే, నీగుణాన్ని నరికినోణ్ణా? మడిసిగా బతకాలని తల్చుకో. నిప్పును నీల్లుగా చూడమాక. అయినా

నిన్ను నరికితే నా సాముల మనసు కట్టపడిద్ది" అంటూ చేతిలోని గొడ్డలిని దూరంగా గిరాటు వేశాడు.

కొండాయ్‌కి మళ్ళీ జన్మ ఎత్తినట్లనిపించింది. ఎటువారటు వెళ్ళిపోయారు.

★ ★ ★

ఆ రాత్రి ఊరంతా సద్దుమణిగాక, పెరటిలో నయ్యిప్రోగు వెనకాల పొగకట్టల ప్రక్కగా పేడ తట్టల క్రింద శరీరాన్నంతా కుప్ప చేసికొని ఉన్న ఒక మహోన్నత మానవాకారాన్ని తన వెంట పోస్టాఫీసు వరకు నడిపించుకొని వెళ్లి, ఇంటిలో చేర్చి, తలుపులు మూసి, "సామీ! ఇట్టాగని మాట మాత్రం తమురేనాడైనా నాతో అని ఉంటే, నే నింత రిచ్చ పడుదునా? తమరికీ ఇబ్బంది కలుగునా?" అంటూ కుమిలి పోయాడు రాములు.

★ ★ ★

ఆ మరునాటి ప్రొద్దున ఆ గ్రామంలో శ్రీరంగం, రామానుజంగారు, కొండాయ్, తపాల సంచి ఇంకా పురప్రముఖులు అంతా కన్పించారు. కాని, రాములు, గజ్జెలకఱ్ఱ కన్పించలేదు. ●

## కథ వెనుక కథ

*మా వూరికి ప్రక్క వూరి సబ్ పోస్టాఫీసు నుండి జాబులు వచ్చేవి. ఆ పోస్టు మాస్టారు గొప్ప గడసరి. అక్షరాలా ఆయనగారి కథే యిది! నాకు ఊహ తెలిసే పాటికే యిది చాలా పాతకథ. చెప్పగా విని కథారూపం యివ్వడం జరిగింది.*

★ *(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 2-1-1963)* ★